# తెలుగు రాష్ట్రాల్లో అధికార భాషగా తెలుగు...

మహమ్మద్ అబ్దుల్ షాహిద్

ప్రపంచంలో విభిన్న సంస్కృతులు, మతాలు, తెగలు ఉన్నాయి. భౌగోళికంగా ప్రతి ప్రాంతానికి, ప్రతి తెగకు ప్రత్యేక భాష మరియు మాండలికాలు ఉన్నాయి.

అలాగే భారతదేశంలో కూడా వివిధ ప్రాంతాల్లో నివసిస్తున్న విభిన్న మతాలు, తెగల వారు వివిధ భాషలు మరియు విభిఊ మాండలికాలు మాట్లాడతారు.



దక్షిణ భారతదేశంలో మాట్లాడే ద్రవిడ భాషల్లో తెలుగు భాషకు ప్రాచీన భాషలలో గుర్తింపుతో పాటు ఒక విశిష్టమైన స్థానం ఉంది అనడంలో ఎలాంటి సందేహం లేదు. తెలుగు భాష ప్రాచీనమైనది అని చెప్పడానికి మూలాలు మొదటి శతాబ్దంలో మనకు కనిపించాయి. శాతవాహన రాజైన హాలుడు రచించిన గాథా సప్తశతి అనే గ్రంథంలో దీనికి సంబంధించిన మూలాలు ఉన్నాయని చరిత్రకారులు చెబుతుంటారు.

ప్రపంచంలో ఉన్న అందమైన లిపి కలిగిన భాషల్లో తెలుగు భాష రెండవ స్థానంలో ఉంది.

తెలుగు భాషకు గల విలక్షణమైన లిపి, ఛందస్సు, వ్యాకరణం, ప్రత్యేక ఆభూషణాలు అదనపు అలంకారాలుగా చెప్పవచ్చు. తెలుగు భాషలోని అక్షరాలు, పదాలు, "భాష" వినడానికి వినసొంపుగా ఉండటం వల్ల తెలుగు భాషను ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్ గా అభివర్ణిస్తుంటారు.

చక్రవర్తులు, రాజులు సామంతులు తెలుగు భాషను రాజ భాషగా, వారి రాజ్య భాషగా, పూజ్య భాషగా, అధికార భాషగా చేసుకుని రాజ్యాలను పరిపాలించారు.

అలనాటి పాలకులు కళలను, సంగీతాన్ని, సాహిత్యాన్ని ప్రోత్సహించడమే కాకుండా వారికి తమ ఆస్థానాల్లో సముచిత స్థానాన్ని కల్పించి ప్రోత్సహించి, పోషించటం వల్ల కవులు, రచయితలు, సాహితీవేత్తలు విలువైన సాహిత్యాన్ని ప్రపంచానికి అందించారు. పుంఖాలు- పుంఖాలుగా వారసత్వంగా లభించిన ఇంతటి విలువైన సాహిత్య సంపదను భవిష్యత్ తరాలకు అందించాల్సిన అవసరంతో పాటు ప్రపంచానికి తెలియజేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

సహస్రాధిక సంవత్సరాలు అజరామరంగా వర్ధిల్లి, తుల- తూగి అలరారిన తెలుగు భాష మరియు తెలుగు సాహిత్యం సమీప భవిష్యత్తులో కనుమరుగై పోయే భాషల చెంత చేరుతుందేమో అనే చింతన తెలుగు భాషా ప్రేమికులు, తెలుగు సాహితీ అభిమానులు, మరియు తెలుగు బంధువుల మస్తిష్కాలను తొలుస్తున్న ప్రశ్న.

ఈ ప్రశ్నకు సమాధానం సత్వరమే చెప్పలేకపోయినా సమస్యకు పరిష్కారం శాశ్వతంగా లభించటమే కాక తెలుగు భాషకు సజీవ భాష హోదా వస్తుందన్న భావనతో పాటు ఆశ కూడా మనందరిలో ఉంది.

దక్షిణ భారతదేశంలోని రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వాలు ప్రాంతీయ మరియు మాతృభాష అయిన తెలుగును రాజ భాషగా, అధికార భాషగా ప్రకటిస్తే తెలుగు భాష పునర్వైభవంతో అజరామరంగా వర్ధిల్లుతుంది. ఈమధ్య తెలంగాణ ప్రభుత్వం తెలుగు భాషను పదవ తరగతి వరకు బోధించాలని నిర్ణయం తీసుకోవడం చాలా సంతోషదాయకం. ఇంటర్ వరకు తెలుగు బోధించాలని నిబంధనను అవలంబిస్తే ఇంకా బాగుంటుంది. అలాగే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా ఇంటర్ వరకు తెలుగు భాషను ఖచ్చితంగా బోధించాలి అనే నిబంధనను విధిస్తే తెలుగు ఎప్పటికీ సజీవంగా ఉంటుంది.




తెలుగు భాషలో భావవ్యక్తీకరణ చేసినంతగా మరే ఇతర భాషలలో వ్యక్తీకరణ చేయలేం అన్నంత సులువుగా, సౌకర్యవంతంగా, అర్థవంతంగా, తెలుగు భాష ఉంటుందనే భావన మనందరిలో ఉంటుంది.

ఇంతటి ప్రత్యేకతలు కలిగిన సుందరమైన తెలుగు భాష, మధురమైన మన మాతృభాష ప్రపంచీకరణ నేపథ్యం, ఆంగ్ల భాషపై మోజు, ఇతర భాషలపై ఆంగ్ల గుత్తాధిపత్యం తెలుగు భాషను అంతరించిపోయే భాషల సరసన చేరుస్తుందేమో అన్న భయం కలుగుతుంది.

ఈ సమస్యను అధిగమించడానికి తీసుకోవాల్సిన చర్యలు, ప్రణాళికల రచన, కార్యక్రమాల రూపకల్పనకై ప్రపంచ వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో నివసిస్తున్న తెలుగు భాషా ప్రేమికులు, తెలుగు సాహితీ అభిమానులు విస్తృత స్థాయిలో మేధోమథనం చేసి ప్రతినిత్యం కార్యక్రమాలు నిర్వహిస్తూ ఉంటే ఫలితాలు ఆశాజనకంగా ఉంటాయనడంలో ఎలాంటి సందేహం లేదు.

తెలుగు భాషా వికాసం మన ఇంటి నుండే ప్రారంభం కావాలి. ఇంటి ఆవరణలో కమ్మ నైనా మన మాతృభాష తెలుగును అనునిత్యం మాట్లాడుతూ పిల్లల చేత స్వచ్ఛమైన తెలుగులో సరియైన ఉచ్చారణతో మాట్లాడిస్తూ ఉంటే భాషపై పట్టు సాధించేలా చేయవచ్చు. మన ఇరుగు - పొరుగు వారితో, అవసరమైతే తప్ప పర భాషలో సంభాషించ కూడదు. సెలవు దినాల్లో, తీరిక సమయాల్లో తెలుగు భాషా వికాసానికి దోహదం పడే కార్యక్రమాల రూపకల్పన చేయాలి. ఉదాహరణకు దినపత్రికలు, కథల పుస్తకాలు, నీతి కథలను బోధిస్తూ చదివిస్తూ వారితో చెప్పిస్తూ భాషపై ఆసక్తిని పెంపొందించేలా ప్రణాళికలు రూపొందించాలి. వేసవి సెలవుల వారాంత సంధ్యా సమయాల్లో తెలుగు భాషా వికాసానికి సంబంధించి వివిధ రకాల ఆటా - పాటల కార్యక్రమాలను నిర్వహిస్తూ వారిని ప్రశంసించి,

ప్రోత్సహిస్తూ పోటీలో నెగ్గిన వారికి బహుమతులను అందించి సత్కరించాలి.

పాఠశాల మరియు కళాశాల విద్యార్థులకు వారి వారి స్థాయిలకు అనుగుణంగా ఆటా-పాటా, ఉక్త లేఖనం, వక్తృత్వం, వ్యాసరచన, తెలుగు పదాలనే ఉపయోగిస్తూ తెలుగులో

ప్రసంగాలు చేయించడం వంటి కార్యక్రమాలను నిర్వహిస్తే తెలుగు భాషా వికాసం జరుగుతుంది.

ఇంతే కాకుండా ప్రభుత్వాలు ప్రాథమిక విద్యను ఖచ్చితంగా మాతృభాషలోనే అభ్యసించాలి అనే నిబంధనను కఠిన తరం చేయాలి. పాఠశాల స్థాయిలో ఒకటవ తరగతి నుండి పదవ తరగతి వరకు, కళాశాల స్థాయిలో ఇంటర్ మరియు డిగ్రీ వరకు ద్వితీయ భాష మరియు ఐచ్ఛికంగా ఉన్న తెలుగు భాషను ప్రథమ భాషగా బోధించేలా రెండు తెలుగు రాష్ట్రాలు చొరవ చూపాలి. ప్రాంతీయ మరియు జిల్లా కోర్టులలో తీర్పులు తెలుగులోనే వెలువరించే విధంగా సంస్కరణలు తీసుకురావాలి. సాంకేతిక పరిజ్ఞానాన్ని విరివిగా వాడుకుంటూ తెలుగు భాషను విశ్వవ్యాప్తం చేయాలి. చరవాణుల్లో సందేశాలను తెలుగులో భాషలోనే పంపించుకోవాలి. సామాజిక, ప్రసార మాధ్యమాల్లో తెలుగు భాష వికాసానికి సంబంధించిన కార్యక్రమాలు నిత్యం ప్రసారం చేస్తూ చైతన్య పరుస్తూ ఉండాలి. ప్రభుత్వ మరియు ప్రైవేటు కార్యాలయాల్లో కార్యకలాపాలు, ఉత్తర ప్రత్యుత్తరాలు, తెలుగులోనే జరపాలి అనే నిబంధనను కఠిన తరం చేస్తే ఖచ్చితంగా తెలుగు భాష వికాసం మరియు తెలుగు భాషాభివృద్ధితో తెలుగు భాషకు పునర్వైభవం రావటమే కాకుండా కమ్మనైన అమ్మభాష తెలుగును సజీవంగా శాశ్వతంగా భవిష్యత్ తరాలకు అందించవచ్చు.

తెలుగు భాషలో మాట్లాడితే ఆత్మన్యూనతగా భావించే ప్రతి తెలుగువాడు నా మాతృభాష తెలుగు, నేను తెలుగు వాడిని అని సగర్వంగా కొండంత విశ్వాసంతో చెప్పుకోగలిగేలా తెలుగులో మాట్లాడుదాం, తెలుగు సాహిత్యాన్ని విశ్వవ్యాప్తం చేద్దాం!

***

## నిజ జీవితంలో హాస్యం



### అట్లాస్

మా అమ్మాయి సౌజన్య స్కూల్ రోజులు అవి..

'డాడీ... ఈ మ్యాప్ ల పుస్తకానికి అట్ట ఊడిపోయి.. ఎక్కడో పడిపోయింది...' శుభవార్త చల్లగా చెప్పింది.

ఓహో..అలాగా.. 'అట్ట..లాస్' అయ్యిందన్న మాట.. జోకు వేశాను..

'అట్ట పోతే పోయింది... డాడీ.. భలే పంచ్ వేశావ్..' అంటూ మెచ్చుకోలు గా అంది..

ఆ 'పటాల పుస్తకాన్ని,' గట్టిగా కుట్టి మంచి అట్ట వేసింది శ్రీమతి.. అది వేరే విషయం.

*****

**భమిడిపాటి వెంకటేశ్వరరావు**

# ఓ స్వాతి కథ

లలితా చండి

ఫోన్ రింగ్ అయ్యేటప్పటికి "హలో" అన్నాడు రామనాధం

అవతలి నుండి "నాన్న వచ్చి నన్ను ఇంటికి తీసుకొని వెళ్లు" అన్న కూతురు స్వాతి మాటకు అలాగేనంటూ ఫోన్ పెట్టి ఆలోచనలో పడ్డాడు.

స్వాతి, నీరజ్ ల పెళ్లి అయి మూడు వారాలు అయింది. వున్నట్లుండి ఈ ఫోన్ కాల్ ఏమైవుంటుందబ్బా? అనుకుంటూ బయలు దేరాడు కూతురి అత్తాగారింటికి...

వెళ్ళేటప్పటికి రెడిగా వున్నా కూతుర్ని, ఆమె మోహంలోని భావనను గ్రహించి నాలుగు రోజులు తీసుకు వెడతాను అని వియ్యంకుడికి చెప్పి ఇంటికి తీసుకొచ్చాడు.



రాగానే కూతురు "నాన్న వాళ్లు అబద్ధం ఆడారు నాన్నా" అంటూ తండ్రి ఒళ్ళో తలదూర్చి ఒక్కసారిగా బావురమంది.

స్వాతి తల నిమురుతూ మౌనంగానే ఓదార్చాడు రామనాధం

కాస్త దుఃఖం ఉపశమించాక నాన్నా వాళ్లు అబద్ధం ఆడారు అతనికి అన్నీ అలవాట్లు వున్నాయి. అది తెలిసి తట్టుకోలేక పోతున్నా అంటూ మరోసారి వెక్కి వెక్కి ఏడ్చింది.

స్వాతి కడిగిన ముత్యంలా కళకళ లాడుతూ వుంటుంది . సన్నగా పొడుగ్గా చూడచక్కని రూపం మంచి నడవడిక కలిగిన అమ్మాయి. విద్యా వంతురాలు కార్పొరేట్ కంపెనిలో పెద్ద ఉద్యోగం పైగా మంచి జీతం కూడా, స్వాతి వాళ్ళది మధ్య తరగతి కుటుంబం తల్లితండ్రులైన రామనాధం సుశీలకు ఇద్దరు సంతానం

స్వాతి మరియు శేఖర్ ఇద్దరూ.

ప్రేమాభిమానలతో మంచి విలువలతో పెరిగారు. స్వాతికి సంబంధాలు చూస్తూన్నారు, ఆన్లైన్‌లో మ్యారేజ్ బ్యూరోను ఆశ్రయించారు. రిక్వైర్‌మెంట్స్ లో నాన్ వెజ్, మధ్యపానము స్మోకింగ్ నిషిద్ధం అని.. అండర్లైన్ కూడా చేసారు.

చివరకి ఓ అమెరికా సంబంధం అన్నిరకాలుగా సరిపడిందనుకొని కుదుర్చుకున్నారు.

నిశ్చితార్థం జరిగిన వారం తిరక్కుండా పెళ్లి కూడా జరిగింది.

ఆడపెళ్ళి వాళ్లు పెద్ద కళ్యాణ మండపం బుక్ చేసి పెళ్లి ఘనంగా చేసారు. పెళ్లి కాగానే అందరిలా స్వాతి అత్తగారింటికి వెళ్లింది.

మొదటి మూడు రోజులు బాగానే గడిచాయి నాలుగో రోజు పెళ్లి కొడుకు నీరజ్ ఫ్రెండ్స్ ఇచ్చే

పార్టీకి స్వాతిని తీసుకొని వెళ్లాడు. అక్కడ నీరజ్ నాన్ వెజ్ తినడం, స్మోక్ చేస్తూ డ్రింక్ చెయ్యడం చూసి తట్టుకోలేక పోయింది. వాళ్ళతో సరదాగా గడపలేక పోయింది.

ఇంటికి రాగానే అదే అడిగింది స్వాతి

"అబద్ధాలు ఎందుకు ఆడారు? మా షరతులు నిబంధనలు ముందే తెలిపాము కదా! అవును చూసామని కూడ అన్నారు"...

"ఇది సహజమేకదా! నువ్వు ఇంత ప్రాధాన్యత ఇస్తావని అనుకోలేదు" అంటూ తేల్చేసాడు నీరజ్...

మర్నాడు ఉదయాన మామగారికి, అత్తగారికి ఇదే విషయం తెలిపితే వాళ్లు కొడుకును సమర్ధించారు.

పైగా "నువ్వు చదవుకున్నదానివి బయటకు వెళ్లి ఉద్యోగం చేస్తున్నావు ఇవ్వన్ని సొసైటిలో కామన్ కదా! ఎక్కువగా పట్టించుకోకూడదు సద్దుకు పోవాలి" అంటూ తేల్చేసారు.

మారుతారేమో అని మరో మూడు వారాలు తరువాత భర్తను అడిగి చూసింది.

చిన్న నవ్వు నవ్వి "లైట్ తీసుకో డార్లింగ్ జాబ్ చేస్తున్నావు కదా! ఆమాత్రం అడ్జస్ట్ కాలేవా?" అన్నాడు.

తన అభిరుచికి ఇక సరిపడదని అర్ధము చేసుకొని తండ్రి ఫోన్ చేసింది.

విషయం మంతా విన్న రామనాథం కూతురిని ఓదార్చాడు.

"ఏం చేద్దాం చెప్పు తల్లీ"

"అతనితో కలిసి బ్రతకటం కష్టం నాన్న రోజు తనకు నచ్చినవి వండిపెట్టలేను, తినలేను తనతో కలిసి హోటల్ కు వెళ్లలేను తను స్మోక్ చేస్తుంటే వూరుకోలేను అందరిలా ఎలా వుండటం" సర్దుకు పోవటం అంటే ఎదుటివారికి నచ్చినట్లు వుంటూ బాధపడుతూ వుండటమేనా?

నా అభిరుచులను ఇష్టాలను చంపుకోవడమా?

రేపు పిల్లలు పుట్టాక వాళ్ల భవిష్యత్తు కోసం నా జీవితం అంతా రాజీ పడడమేనే?... కొన్ని నిర్ణయాలు వెంటనే తీసుకుంటేనే మంచిదని నా అభిప్రాయం నాన్న" అంటూ తన నిర్ణయం తెలిపింది...

"రేపు వెళ్ళి వాళ్ళతో మాట్లాడదాం" అన్నాడు సాలోచనంగా రామనాథం.

స్వాతికి శాఖాహారం చిన్నప్పటీ నుండి అలవాటు, ఇష్టం.

జీవితమంతా ఆ అలవాటు లేని వ్యక్తితో కలసి బ్రతకటం ఎంత కష్టం. జీవితం చాలా చిన్నది ఉన్నంతలో సంతోషంగా ప్రశాంతంగా బ్రతకాలి, సమస్యలు వుంటే సామరస్యంగా వెంటనే పరిష్కారించుకోవాలి, కాని ఎప్పుడో ఎవరో మారుతారని ఎదురుచూస్తూ నిత్యం గొడవలతో జీవించడం స్వాతికి అసలు ఇష్టం లేదు. అదే తండ్రికి చెప్పింది.

"నాన్న.. నా నిర్ణయం ఆలోచించి తీసుకున్నదే ఇక అతనితో కలిసి నేను జీవించలేను"

రామనాథం కూతురి నిర్ణయంపై నమ్మకం వుంది పై పెచ్చు సర్దుకుపో అని చెప్పే మనస్తత్వం అంతకన్నా కాదు. నిత్య జీవితంలో భార్యాభర్తల నడుమ ఆహార అలవాట్లలో తేడా వుంటే అది నిత్యం వేధించే సమస్యే! తనకూ నచ్చదు ...

"అలాగే స్వాతి రేపు వెళ్లి అడిగి చూద్దాం లేకుంటే నువ్వు చెప్పినట్లు డివోర్స్ కు వెడదాం" అన్నాడు రామనాథం.

మర్నాడు ఇద్దరూ వెళ్ళి మాట్లాడటం వాళ్లు వెంటనే సరే అనటం జరిగింది. పెళ్ళికి అయిన ఖర్చులే కాదు ఇంకో పది లక్షలు ఎక్కవ ఇస్తామని అన్నారు,

దానికి అభిమానం దెబ్బతిన్న రామనాథం "మాకు ఒక్క రూపాయి కూడా ఎక్కువ వద్దు మా ఖర్చులు ఇస్తే చాలు. మీరు ఆడిన అబద్ధానికి పరిహారం ఇస్తున్నారా? లేక నా కూతురు శీలానికి వెల కడుతున్నారా?" అంటూ బాధపడ్డాడు.

పదినెలలు తిరక్కుండా విడాకులు వచ్చాయి. ఒక అబద్ధం ఓ నిండు జీవితానికి ఎంత వేదనను ఇచ్చిందో, స్వాతి తీసుకున్న నిర్ణయం రేపు ఆమె జీవితాన్ని ఎటు నడిపిస్తుందో అనుకున్నాడు రామనాథం.

***




